# 'వయస్సూ, బుద్ధీకూడా పెరుగుతాయి'

**తో**లుపెట్టె బల్లమీద నుంచుచు "ఇంత తొరగా రమ్మని రాశాడెందుకూ మా నాన్న?" అని రుసురుసలాడుచు భాస్కరరావడిగెను. "నీ సుఖం కోసమే చూస్తూ వుంటే అలా చిమచిమలాడతా వేమిటిరా నాయనా?" అని కళ్లు చిట్లించుకొనుచు లచ్చమ్మ బదులడిగెను.

"నెల్లాళ్ళు కాలేదింకా వెళ్ళీ. పదిమాట్లు యిలాగా అలాగా తిరిగితే చదువు పోదూ? చెన్నపట్టం అంటే యిక్కడా అక్కడా వుందనుకున్నావా యేమిటి? రానూపోనూ పదహారురూపాయలవుతాయి".

"అయితే అవుతాయి. పని వచ్చినపుడు రూపాయలు లెక్కచూసుకుంటూ కూచుంటే యెలాగా?పదిహేను రోజులుకే చదువు పోతుందా?"

"చదువంటే యేమిటనుకున్నావూ? పోవడానికి వక్క క్షణం చాలు".

"పోతే పోయింది. అచ్చటా ముచ్చటా కంటేనా చదువూ! నువ్వు సంపాదిస్తే గాని గడవదా యేమిటి? ఇంతకీ అయిదారుమాసాల్లో నువ్వు చదువెలాగా మానెయ్యవలిసిందే"

"ఆవుద్భుతం యేమిటి? యిక పొలాలమ్మట తిప్పాలనుకుంటున్నారు కాబోలు నన్ను".

"పొలాలు తిరిగీదాకా నీకేం? ఈ యేటితో వ్యవసాయం యెలాగా మానిపించేస్తాను మీనాన్న చేత. కష్టపడడానికీ మనకేం తక్కువా? అయినకాడికి అమర్చుకున్నా పాతికపుట్ల ధాన్యం కాళ్ళదగ్గరికి వస్తాయి".

"ఇంతకీ నన్ను రమ్మన్న పనేమిటీ?

"గుమ్మంలో అడుగు వాకట్లో పెట్టలేదింకా అలా తొందర పడతావేమిటిరా? పున్నం వెళ్ళిన పంచమినాడు నీకు కార్యం".

"అప్పుడే"

"అప్పుడేనా యేమిటి? రెండేళ్లయింది సుందరమ్మ సమర్తాడి".

భాస్కరరావు మరి మాట్లాడలేదు. "బనారసుచీరా తక్కినవస్తువులూ తేవడానికి మీనాన్న రాజమహేంద్రం వెళ్లేరు. తెల్లారేటప్పటికి పడవమీద

వస్తారు" అని లచ్చమ్మ చెప్పెను; గాని అతడది వినిపించుకొనకుండ చరచర మేడమీదికి పోయెను. "వద్దు మొర్రో అంటూంటే బనారసుచీర తెస్తానని వెళ్ళేరు. పెళ్ళిలో నాలుగుజరీపోచల గుడ్డ పెట్టేటప్పటికి తాతలు దిగి వచ్చేరు వియ్యాలవారికి. మనుగుడుపుముచ్చట పెడనచీరీతోటే తీరిపోయింది. ఇప్పుడేనా వాళ్ళు అబ్బాయికి తగిన చాపూ, నాకు మంచి చీరా పెడతారో పెట్టరో" అని గొణుగుకొనుచు లచ్చమ్మ లోపలకు పోయెను.

"వచ్చావా, తమ్ముడూ? ఏం చెప్మా యింకా రాలేదని యెదురు చూస్తున్నాను" అని పలుకుచు జగ్గమ్మ యెదురువచ్చి తోలుపెట్టి పుచ్చుకొనియెను. "సంగతి వింటే తమ్ముడు పొంగిపోతాడు" అని జగ్గమ్మ అనుకొనియెను; గాని భాస్కరరావు ముఖమున ఉత్సాహము లేదు. సిగ్గుఅదిమిపెట్టుచున్న ఆనందపు మొలకలుగూడ కాన్పింపలేదు.

## 2

పున్నమ వెళ్ళి పంచమి వచ్చినది. తెల్లవారినది. ఇటు సూర్యోదయ మగుచుండగా అటు సోమంచివీరయ్య మాచవరము రేవులో గంభీరముగా నిలిచియుండెను. "అందరూ తొరగా దిగాలి. మీరీ పైనుంచి దింపండోయి బళ్ళూ. కాలవ మహాపూటుగా ఉంది యివేళ. అదిగో పడవమీద వంకాయల బుట్టలూ గట్రా దిగుతున్నాయి మనకోసమే. చూస్తారేం యింకా? ఆలస్యం చేస్తే చంటిపిల్లల చద్దన్నాలకి పొద్దెక్కిపోతుంది. నువ్వుదిగూ భాస్కరం ముందు వూళ్ళోకి వెళ్ళాలి వర్షం రాకుండానూ. నువ్వు అబ్బాయితో ఉండాలి తొరగా దిగక చూస్తావేం? పురోహితుడెక్కడయ్యా? ఏమండోయి! నూరావధానులు గారూ తొరగా స్నానం చేసి వెళ్ళండి మీరూ. వర్షం రాకుండా రామచంద్రుడుబావగారు ఊళ్ళోకి పిలవడానికి వెళ్ళే వుపాయం చూడాలి మీరు" అని యాతడు చాల అడావుడి చేసెను; గాని అతని తొందర ఎవరికీ ఇబ్బంది కలిగింపలేదు. అందరును నిదానముగనే బళ్ళు దిగిరి.

పడుచులు, కన్యలు, పిల్లలు, చంటి పిల్లల తల్లులు, ముసలి పేరంటాళ్లు, నలుగురైదుగురు బాలవితంతువులు, ఒకబోదకాలు ఆమె, ఏడెనమండుగురు పురుషులు, అయిదారుగురు భాస్కరరావు స్నేహితులు, నలుగురైదుగురు రైతుమిత్రులు, రాయవరము గ్రామకరణము, ఇంటి మంగలి, ఇంటి చాకలి–

తూముదగ్గరనుండి దోనెవఅకును రోడ్డంతయు నిండిపోయిరి. వారి నిమిత్తము బల్లకట్టు నాలుగైదుసారులు తిరిగెను. అందరికంటె ముందు భాస్కరరావు, లచ్చమ్మ, జగ్గమ్మయు దాటిరి.

అవ్వలియొడ్డున స్నానాదికమునకు వచ్చిన మాచవరము బ్రాహ్మణులు కొందరు పెండ్లికొడుకును జూచి నవ్వుకొనిరి. పెళ్ళివారందరును వెళ్ళిపోయిన తరువాత వారిలో నొక బక్కపలచని పెద్దమనుష్యుడు "పెళ్ళి కేనా తగని వయస్సూ" అనియెను. "పెద్దాళ్ళకేనా బుద్ధితీరిండాలి" అని యొక యువకుడు జాడించి పలుకగా "ఆడపిల్లలికి పద్ధానుగేళ్ళు దాటితే గాని పునస్సంధానం చెయ్యగూడదని శాసనం పుట్టబోతూ ఉంటే మగపిల్లలికి ఈవుద్ధృతం యేమిటోయి?" అని యొక చిరుబొజ్జ పెద్దమనుష్యుడనియెను.

దారిపొడుగునను బ్రాహ్మణేతర స్త్రీ పురుషులు "బేమ్మలేపని చేసినా యింతే" అని యీసడించిరి. ఒక ముసలామె "నీకెన్నేళ్ళు ఉన్నాయి నాయనా?" అని భాస్కరరావునే అడిగెను. ఒక వేశ్య చూచి సెబాస్ అనియెను.

"వారు తొందరపడితే మీరంగీకరించాలిటండీ? నిలపండి నాలుగేళ్ళ దాకా. లోకం మిమ్మల్నేమీ అనదు" అని స్నేహితులు సలహా చెప్పిరి. గాని పిడపర్తి రామచంద్రుడు సాహసింప జాలకపోయెను. "ఏంచెయ్యాలి నాయనా మాలచ్చమ్మవదిన మంకుపట్టు పట్టింది. ఇంకా వక సంవత్సరమేనా ఉండండీ అంటే "మీరు ఓపలేకపోతే మా యింటికి పంపించెయ్యండి అంది ఆవిడ. వీరయ్యగారు ఆవిడయెదట మాట్లాళ్ళేరు. ఇల్లుపట్టిన జగ్గమ్మ ఆర్భాటం యిక చెప్పనే అక్కర్లేదూ. ఇంతకీ మా అమ్మాయి యోగం యెలా ఉంటే అలా అవుతుంది. ఇంతదాకా వచ్చేక యిక నిలుపమంటే యెలాగా? మా అభ్యంతరం లేదు. వారితో మాట్లాడండి మీరు. సన్నాహం అంతా చేసుకున్నాం గనక వారు వప్పుకుని వెనక్కి తగ్గితే యీయేడు తలుచుకోకపోయినా మారెండో అబ్బాయికి వదుగు చేసుకుంటాం" అని సుబ్బమ్మ చెప్పెను. దానికి స్నేహితులు మాట్లాడఁజాలకపోయిరి.

## 3

ఉదయము తొమ్మిగంటలవేళ వధూవరులు పీటలమీద కూర్చుండిరి. వయిపులు సరిగ్గ అందకుండుటచే పురోహితుడు మందు తినినవానివలె

నుండెను. సుబ్బమ్మ సరఫరాలలో లోపము కలుగకుండ చరచర తిరుగుచుండినను ఆమె ముఖమున లజ్జయు విషాదమును పెనగొనియున్నవి. రాయవరము నుండి వచ్చిన పేరంటాళ్ళందఱు నొక ప్రక్కను, పిడపర్తి వారిపక్షమువారందరు నొక ప్రక్కను పందిటలో నిలిచియుండిరి. ఈ కార్యము బలవంతముమీద జరుగుచుండుటచే పూర్వవైరమున్నవారి వలె ఉభయపక్షములవారును గూడ కలియఁజాలకుండిరి.

గ్రామస్థులు గుసగుసలు మానలేదు. మగపెళ్ళివారిలో ఒక రిద్దరుగూడ వారిలో కలిసిరి.

ఇది యిట్లుండగా ఒక ముసలావిడ వచ్చి "వడక పెళ్ళికొడుకులా ఉన్నాడు. ఏంతొందర వచ్చిందమ్మా" అని పక్క కోసరిల్లెను. గ్రామస్థులందఱును నవ్వుకొనగా రామచంద్రుడు మొగము వంచుకొనియెను. సుబ్బమ్మ లోపలికి పోయెను. సుందరమ్మ కట్టుకొనిన పట్టుచీరమీద నాలుగయిదు కన్నీటి చుక్కలుండుట చూచి భాస్కరరావు తహతహపడి ఆమెతో సరిగ తలవంచుకొనియెను.

అది విన వీరయ్య రుసరుస లాడెను. అచ్చమ్మ వచ్చి "అడ్డమైనవాళ్ళూ మాకు చక్కట్లు దిద్దడానికి మేము బొట్టు పెట్టి పిలవలేదు" అని విదిలించి పలికి నాలుగుదెసలుకును జూచెను.

ఎవరును దేనికిని సమాధానము చెప్పలేదు గాని "ఇరుకుగా ఉంది. పైగా పొగకూడానూ. హోమా అయిదాకా వీధి అరుగుమీద కూచుంటాము" అని గ్రామస్థులు లేచి వెళ్లిరి. సంభావనకు వచ్చిన వారు మాత్రము ఈయవకాశము చూచుకొని ముందుకు జరిగి కూర్చుండిరి.

భాస్కరరావు అస్వతంత్రుడయినా తెలివయినవాడే. అతడు అత్తమామల స్థితిని గ్రహించెను. భార్య భావసరణి నూహించుకొనియెను. అరగుమీద కూర్చుండి ఊరివారు చేయు ప్రస్తావననుగూడ అతడు పోల్చుకొనియెను. మొత్తము అందరికండ్లును తనమీదనే యున్నవని యాతడు నిశ్చయించుకుని కుతకుతలాడిపోవుచుండెను; గాని మంత్రముగ్ధునివలె పురోహితుడు చెప్పిన వన్నియు మాట్లాడకుండ చేసివేయుచునే యుండెను.

పదిన్నరగంటలకు ఆశీర్వచనము లయినవి. మంగళహారతి యిచ్చుటయే తడవుగ తల్లిచేయూత నీయగా సుందరమ్మ గుభాలున లేచి

చీకటిగదిలోనికి పోయెను. భాస్కరరావు తమ సామాను ఉన్న గదిలో పోయి కూర్చుండగా లచ్చమ్మ వచ్చి జామారు పరీక్షించి "మూడు రూపాయలగుడ్డ పెట్టేరు. రాత్రికేనా మంచిచాపు ఇవ్వకపోతే బనారసుచీర వెనక్కి పెట్టిస్తాను" అనియెను. అందులకు అతడు "కాస్సేపు మాట్లాడకే" అనగా నామె హోమధూమము వలన కొడుకు కండ్లు మండుచున్న వేమో యని భావించి ఇవ్వలకు వచ్చెను.

"పెళ్ళికొడుకు చిన్నవాఁడయితే మాత్రం భోజనాలికి అడ్డేముంది? ఈమధ్య పప్పుధప్పళాలు తగిలి చాలా రోజులయింది. రండయ్యా మడి కట్టుకుందాము" అని యొక గ్రామస్థుడనగా "రామచంద్రుడుగారు బొబ్బట్లకి పురమాయించేరు. అంతా రావాలి సుమండీ. పొరుగూరి మేష్టర్లు వెళ్ళిపోతా రేమో వల్లగాదు" అని యింకొంకడనియెను. అందరును గుమ్మము దిగిరి. "అయ్యా వంటలయినాయి. మడికట్టుకోవచ్చు. మీ వెనక్కాలే వస్తున్నాను" అని రామచంద్రుడు చెప్పి వంట యెంతవర కయినదో కనుగొనుటకు వంటపందిరిలోని కరిగెను.

## 4

మధ్యాహ్నము రెండుగంటలు మొదలు గ్రామమునందలి స్త్రీ లొక్కరొక్కరే తగవులు పట్టుకొని భోజనమునకు వచ్చిరి. అందరికిని అదేపెరటిలో వడ్డించిరి. చేతిలో పడుచున్న నేతిని చూడకుండ "సుబ్బమ్మగారూ, మీరుగూడా తొందరపడ్డా రేమండీ?" అని యొక తరుణి యడిగెను "తెలివయినవాడు కనుక యెప్పే చదువుతున్నాడు కాబోలు. మా మూడోతమ్ముడంత ఉన్నాడమ్మా" అని యిక నొక పడుచు పలికెను. "పెళ్ళిలోనే వరహీనత బాగా కనబడింది. అసలు సుందరమ్మ బొబ్బిలిలా ఉంది. పిల్లాడు పీల. ఈడు వచ్చిందంటే ఆడాళ్ళు యిట్టే యెదురుతారు. ఆపయిని పిల్లాడికి పదహారేళ్ళు నిండనే లేదుట యింకా. సుందరమ్మ రజస్వల అయిన తరువాత రెండేళ్ళు ఆగినవాళ్ళు ఇంకో రెండేళ్ళు ఆగలేరూ? ఏంతొందర వచ్చిందీ" అని యింకొకతె అనియెను. "పెళ్ళికొడుకు యెంత ఉంటే మన కెందుకమ్మా ఆ పిల్లాడుతల్లి విన్నదంటే కజ్జాకొస్తుంది. రెండు బొబ్బట్లు వెయ్యండమ్మా మాపిల్లకీ. మొన్ననే జబ్బుపడి

లేచింది. అజీర్తి చేస్తే కష్టం. కాస్త నెయ్యి వెయ్యండి సుబ్బమ్మగారూ. ఏదో జమీందారులు పిలవగా భోజనానికి వచ్చాంగనక వచ్చిన పని చేసుకుని వెళ్ళిపోతే మంచిదీ" అని యొక ప్రౌఢ అనియెను. "వింటే మాత్రం యేమి చేస్తుందేమిటి? మంచయినా చెడ్డయినా చెప్పుకోక మానరు నలుగురూనూ. సుబ్బమ్మగారు అనేకవిధాల బతిమాలేరుట. రామచంద్రుడుగారు కాళ్ళమీద పడ్డంత ప్రాధేయపడ్డారుట. వకటే పట్టుట ఆవిడిది" అని యింకొక ప్రౌఢ పలుకగా "వింటే యేమి చేస్తుందంటే యిందాకా పీటలమీద కూచున్నప్పుడు చూశావుకాదూ రామక్కగారి బామ్మని యెలా దులిపేశిందో ఆవిడ?" అని యింకొక యువతి అనియెను.

ఈసమయమునకు సరిగ అక్కడకు జగ్గమ్మ వచ్చెను. ఆమెను చూచి అందఱును పెదవులు కరుచుకొనిరి. కొందరు తామనిన మాటలు ఆమె వినలేదనుకొనిరి; గాని ఆయూహ నిలువలేదు. "మా అమ్మ దులిపేసిందంటే తప్పా? ఆవిడి కెందుకూ మాగొడవలూ? చూడడానికి వస్తే నోరు మూసుకుని చూసిపోవాలి. ఇందాకణ్ణుంచి చూస్తున్నాను మిమ్మల్ని. పిల్లాడి కెన్నేళ్ళుంటే మీకెందుకూ? పిల్ల సమర్తాడి యెన్నేళ్ళయితే మీకేమీ? భోజనానికి వచ్చినవాళ్ళు తిన్నంత తిని పోవాలి. ఎదటిపచ్చ చూడలేకపోతే యింటోనే మణిగి ఉండాలి. ఇక్కడికి వచ్చి యిలాంటి మాట లంటారా?" అని జగ్గమ్మ అందుకొనియెను. "ఎవళ్ళ కష్టసుఖాలు యెవళ్ళకి తెలుస్తాయీ?" రెండేళ్ళయింది పిల్ల పెద్దదయీ. ఇంకా యెన్నేళ్ళు ఉంచమంటారూ? ఈ వూరు ఆడాళ్ళు యింత కజ్జాకోరులు కాబోలు. ఎరక్కపోయి పడ్డాం" అని యామె ఉపన్యాసమును పొడుగించుచుండగా సుబ్బమ్మ వచ్చి రెండు చేతులును పట్టుకొని బతిమాలెను. "మా తల్లివికాదూ? ఎవరిదయినా తప్పే. ఇక ఊరుకో" అని యామె చెప్పగా జగ్గమ్మ "మీరు మాత్రం మాప్రతిష్ఠ యేమి అట్టేపెట్టేరూ? వూళ్ళో వాళ్ళందరూ మమ్మల్ని ఆడిపోసుకుంటూఉంటే మీరుగూడా వాళ్ళల్లో చేరారుగాని మీకిది తగదని మందలించగలిగేరా? కార్యం చెయ్యడానికి ఓ పట్టాన వప్పుకోక పోతిరి. ఇప్పుడిదీ. కావలసినవాళ్ళే యిలా చిన్నతనం చేస్తూఉంటే యిక పరాయివాళ్ళు ఊరుకుంటారా?అసలు మేం అంతా రావడం మాది తప్పూ. పెళ్ళికొడుకుని పంపేసి వూరుకోవలసింది. చాల్లెండి

నేర్చుకుపోయారు" అని యామె విదిలించుకొని రివ్వున వెడలిపోయెను. "ఇక మాతాళం పడుతుంది. తల్లీ కూతురూ యేకమై మాసుందరమ్మని నేలబెట్టి రాసేస్తారు" అని వగచుచు సుబ్బమ్మ లోపలకు బోయెను. ఊరిపేరంటాళ్లు లచ్చమ్మ వస్తే మరీ కష్టం అని గబగబ తిని వెడలిపోయిరి.

## 5

ప్రకాశరావుపంతులు బ్రహ్మసమాజ మతాభిమాని. "దేశం బాగు పడాలంటే బ్రహ్మసమాజ మతంలో కలిస్తేనే బాగుపడుతుంది" అని యాతని సిద్ధాంతము. తల్లి యింకను బ్రతికియుండుటచే కేవలము ఆవిడ నిమిత్తము ఆతడింకను అందు ప్రత్యక్షముగా కలియలేదు. "నాయనా, ఇంక ఆరుమాసాలు. కాకపోతే సంవత్సరమూ" అని యామె నాలుగేళ్ళ నుండి కాలము గడుపుకొని వచ్చుచున్నది. "దురాచారాలు మానేస్తే చాలదూ? కేవలమూ ఆమతంలోనే కలవాలా?" అంటే "తప్ప"దని యాతడు ఖచ్చితముగా చెప్పును.

అతడు రామచంద్రపురమున బాలికా పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు. సుందరమ్మ కొన్ని దినములు అతనికి శిష్యురాలు. ఈ కారణమువలన ఆహ్వానము జరుగగా అతడు గూడ నాడు మాచవరము వచ్చెను. భాస్కర రావును జూచినప్పటి నుండి ఆతడిని ఒడలు మండిపోవుచున్నది.

విందు కుడిచిన గ్రామస్థులందరును రామచంద్రుని పొరుగింట చీట్లాట ప్రారంభించిరి. ఆస్థలము సరిగ భాస్కరరావు కూర్చుండియున్న గదికి గోడయావల నుండెను. ప్రక్కయింటిలో సహింపరాని దురాచారము జరుగ నుండగా గ్రామస్థులిట్లు అంధప్రాయముగా చీట్లాడుచుండుట ప్రకాశరావు కోపమును మరింత వృద్ధిచేసెను. అంతట సింహకిశోరమువలె వారి మధ్య నురికి యాతడు తన అసమ్మతి నిట్లు వెలిబుచ్చెను.

"ఎవ రేమనుకున్నా సరే నాకు తోచిన మాటలు నాలుగూ అనెయ్యక మానను. మేం బ్రాహ్మలం అని విర్రవీగితే చాలదు. ఏలక్షణం చేత బ్రాహ్మలవు తారో ఆలక్షణం చూపించాలి. ఈదేశంలో సంఘాన్ని నడిపే పూచీ బ్రాహ్మలమీద ఉంది. అది నిర్వహిస్తేగాని బ్రాహ్మణ్యం యెలా నిలుస్తుందీ?

నిజానికీ యేదురాచారాలూ జరిగినా అవి బ్రాహ్మల్లోనే యెక్కువగా ఉన్నాయి. వాట్లని తగ్గించుకోవాలనే జ్ఞానం వక్క బ్రాహ్మడికేనా వున్నట్లు లేదు. సంఘం యింత కుళ్ళిపోతూ వుంటే "స్వరాజ్యం అదిగో హైదరాబాదు అవతల వుం"దంటే యెవడు నమ్ముతాడు? పక్కయింటో దారుణమైన దురాచారం జరగడానికి సిద్ధంగా ఉండగా మీరు కడుపునిండా బొబ్బట్లు, పూరీలూ తిని చీట్లాడడంలో యేమేనా ఔచిత్యం ఉందా? మీ ఊళ్ళో తప్పుపని జరిగిందంటే ఆ అప్రతిష్ఠ మీది కాదూ? మీపొరుగింటి పెద్దమనిషికి చిక్కువచ్చినపుడు మీరిలా నవ్వుకుంటూ కూచోడం బాగుందా? పదమూడేళ్ళేనా నిండని ఆడపిల్లకి గర్భాదానం జరగడం అక్కడక్కడ చూశాను. గాని పదహారేళ్ళునిండని పిల్లవాడికి తల్లిదండ్రులు పునస్సంధానం తలపెట్టడమూ, బంధువులందరూ కట్టకట్టుకుని రావడమూ, వూళ్ళోవాళ్ళందరూ బొబ్బట్లూ, పూరీలు తిని కడుపులు నిమురుకుంటూ కూచోడమూ, అన్నిటికంటే యఫ్. యే. చదువుతూ వున్న యువకుడు అందుకు సిద్ధపడడమూ-ఇలాంటి ఘోరం నేనెక్కడా చూడాలేదు వినాలేదూ. రామచంద్రుడుగారూ, సుబ్బమ్మగారూ యీ కార్యం యిప్పుడు చెయ్యవలసివచ్చినందుకు యెంతసిగ్గుపడుతూ ఉన్నా వారుగూడా ఈ తప్పులో భాగస్వాములే. తమబిడ్డమీద వారికి నిజంగా అభిమానమే ఉంటే "మేమీ కార్యం యిప్పుడు ససేమిరా చెయ్యము" అని చెప్పవలసింది. బిడ్డకాపురం యెక్కడ చెడిపోతుందో అని వారు భయపడి వూరుకున్నా మీరంతా వూరుకుంటారా?"

ఇది విని గ్రామస్థులు కొందరు సిగ్గుపడిరి. "మీరు చెప్పేది అంతా ధర్మమే. మా శక్తికొద్దీ చెప్పేము రామచంద్రుడు గారితో. ఆయన "పిల్ల కాపురం పోతుం"దన్నారు. మేం మాట్లాళ్ళేకపోయాము. తల్లీదండ్రీ మూర్ఖపుపట్టు పట్టినా ఇంగ్లీషు చదువుతూ ఉన్న పెళ్ళికొడుకేనా యిందుకు సిగ్గుపడవలసింది. అతను సిద్ధపడ్డాడుగాని సిగ్గుపడలేదు. టింగురంగా అని నరెడ్లబండిమీద వచ్చేడు; గాని చాటుగా నైనా రాలేదు. అక్కడికీ యిందాకా పీటలమీద కూచున్నప్పుడు వక ముసలావిడ అన్న మాటలు విన్నారా? పెళ్ళికొడుకు తల్లి అవిణ్ణి యేమందో చూశారా? వారన్ని విధాల తెగించి వస్తే మీరు మమ్మల్ని అంటారా? మా దగ్గిర వకలోటు ఉంది. మేము మీలాగా తెగబడి చెప్పలేకపోయాము. కాని మీకూ మాకూ ఫలం వకటే. వారీ కార్యం యెలాగా మానరూ" అని వారిలో కొందరు చెప్పిరి. "ఎలా

మానకుండా ఉంటారో చూస్తాను" అని ప్రకాశరావు వీధిగుమ్మములోనికి వచ్చెను. చూడగా ఈ గొడవ వినుచు వీధిలో అనేకులు కూడియుండిరి. ప్రకాశరావునకు మఱల ఉద్రేకము కలిగెను.

"ఇది అరణ్యమా వూరా? మీరందరూ చూస్తున్నారా? కళ్ళు మూసుకుని ఉన్నారు. మీ వూళ్ళో చాలా చెడ్డకార్యం జరుగుతోంది. మీరు పూనుకుంటే యిది ఆగిపోతుంది. రామచంద్రుడుగారు మంచి బ్రాహ్మడు. మర్యాదకి జంకి ఊరుకున్నారు వారు. మీరు కొంచెం శ్రద్ధ చెయ్యాలి" అని యాతడు చెప్పగా వారందరును ప్రయత్నించెదమనిరి.

ఇది యంతయు భాస్కరరావు చెవులలో బడెను. ఇవి యాతనికి మాటలవలె గాక కాలిన ఉక్కుగుండ్లవలె తోచెను. "లోకంలో ప్రతీవాడికీ పునస్సంధానం అవుతూనే ఉంది కాని ఈ మర్యాద నాకొక్కడికే తక్కింది" అని యాతడు అనేక విధముల గుంజుకొనియెను. "ఈ కార్యం యెలా నెరవేరుతుందో చూస్తాను" అని యనుకొనుచు ప్రకాశరావు రామచంద్రపురము వెడలిపోయెను.

సాయంకాలమయినది. "ముహూర్తం పదకొండుగంటలికి గనక భోజనాలీ లోపునే అయిపోవాలి. మీరిలా కూచుంటే కాదు. తొందరగా పిలిచి వద్దాము రండి వూళ్ళో" అని వీరయ్య తొందరపెట్టి రామచంద్రుని తీసుకొని డోలుసన్నాయిలు వెంటబెట్టుకుని గ్రామములోనికి బయలుదేరెను. సుబ్బమ్మ వంచిన మొగము ఎత్తలేదు. లచ్చమ్మ మాత్రము వీధిలో గుంపులు గుంపులుగ నున్న వారిని జూచి "యెవళ్ళ యిష్టము వచ్చినట్లు వాళ్ళు నడుస్తారు. మా గొడవలు వీళ్ళకందరికి యెందుకూ?" అని గొణుగుకొనుచు బయలుదేరెను.

## 6

చీకట్లు క్రమ్ముకొనిన తరువాత భాస్కరరావు ఒక స్నేహితునితో కాలువకు బయలుదేరెను. మార్గమధ్యమున నాతడు ఇందులకు చాలా విచారించు చుండుట తెలిపి సలహా చెప్పు మనియెను. "ఇంతవరకూ వచ్చేక మానెయ్యడానికి మీవాళ్ళు అంగీకరిస్తారా?" అని స్నేహితుడడుగగా భాస్కరరావు నిరుత్తరుడయ్యెను.

కాల్వగట్టు చేరునప్పటికి రామచంద్రపురము నుండి వచ్చుచున్న పదిమంది విద్యార్థులాతనిని కలిసికొనిరి. వారందరును ఇప్పుడు తన బావమరిదికి సహాధ్యాయులు. పూర్వము తనకు సహవాసులు. వారిక్కడకు వచ్చుటకు భాస్కరరావు బావమరిది ఆహ్వానముకంటె ప్రకాశరాయని ప్రోత్సాహము అధికమయ్యెను.

అతడు వారితో మాట్లాడుటకే గాదు వారిని కలిసికొనుటకే లజ్జించెను; గాని తప్పినదిగాదు. అతడు తొలగిపోదలచుచుండగనే అందరును చుట్టుకొనిరి. అది యాతనికి కంఠము నులిమి చంపుటకు శత్రువులు మీదికి వచ్చుచున్నట్లుండెను.

"అదృష్టవంతుడోయి భాస్కరం. మనలో ఇంత చిన్నతనంలో ఎవడికి కాపరానికి వచ్చిందిరా పెళ్ళామా?" అని యొకడనియెను. "అదేనా యేమిటి వాడి అదృష్టానికల్లా మూలం. చూడు మళ్ళీ యీ రోజులకి కొడుకుని ఒడిలో కూచోపెట్టుకుని "ఏం చేస్తున్నావూ? చూడూ అబ్బాయి వుచ్చపోసి బట్ట తడిపేడు తియ్యా" అంటూ ఉంటాడు" అని యింకొకడనియెను. "వొరే నరసింహానికి (భాస్కరరావు బావమరిదికి) యింకా పెళ్ళే కాలేదుగదా వీడికొడుక్కి పిల్ల యెలాగరా మరి?" అని వేఱొకడనగా, "నీమొహం. వాడికి పెళ్ళయి పెళ్ళాం కాపరానికి వచ్చి కూతురు పుట్టేదాకా ఊరుకుంటాడూ వీడూ? తనకి పదహారేళ్ళు వెళ్ళందే పెళ్ళాం కాపరానికి వచ్చింది గనక తన కొడుక్కి పన్నెండేళ్ళకే రావాలని ఇది వరకే పుట్టి ఉన్న పిల్లని పెళ్ళిచేస్తాడు. నీకేం తెలుసును వీడి సంగతి? చాలా అదృష్టవంతుడోయి వీడూ" అని మఱియొకడనియెను. "అట్టే వేళాకోళాలు చెయ్యకండిరా పాపం వాణ్ణీ. అసలిప్పుడు కార్యం చేసుకోవడం వాడికి సుతరామూ ఇష్టం లేదు. వాడికేగాదు. అత్తారికి కూడా యిష్టంలేదట. తల్లిదండ్రీ తొందరపడితే వప్పుకున్నాడు పాపం వాడు" అని యొకడనగా, "తెలివి తెల్లవారినట్లే ఉంది. తన కిష్టం లేకపోతే తల్లీదండ్రీ యేం చెయ్యగలరురా? వీడివన్నీ వేషాలు. పైకి అలా నటిస్తాడు. అబ్బో పెద్ద యెత్తుల్లోవాడురా వీడూ. ఇక మనతో మాట్లాడతాడనుకున్నా వేమిటి? పదహారేళ్ళు నిండనిదే యఫ్.యే.చదవడం వకయెత్తూ, పెళ్ళాం కాపరానికి రావడం వకయెత్తూనూ. వీడికి కళ్ళు నెత్తికి రావడానికి, రేపు యింటికి వెళ్లి పిలిస్తే పలుకుతాడనుకున్నా వేమిటి?" అని యింకొక డనియెను. "ఎందుకురా మీకా కడుపుబ్బు? పద్ధానుగేళ్ళ పెళ్ళాము, పదహారేళ్ళ మొగుడూ

జేనెడు కొడుకు నెత్తుకుని ఉసూరుమంటూ గుఱ్ఱబ్బండిలో కూచుని బీచికి షికారు వెడితే ఎంత అందంగా ఉంటుందీ? మనం పూర్వజన్మంలో పెట్టిపుట్టలేదు గనుక ఇరవేయ్యసి యేళ్ళు వచ్చినా యే యిద్దరికో తప్ప తక్కినవాళ్ళకి పెళ్ళేకాలేదూ. అయితే భాస్కరం! పెళ్ళాన్ని మద్రాసు తీసుకువెడతావా? ఎప్పుడేనా యిక్కడికి నువ్వే వస్తూ వుంటావా? మీ అమ్మ చాలా వుబలాడ పడ్డారనుకుంటాను ఈ కార్యం కోసం. అంచేత పెళ్ళాన్ని మీ వూళ్ళోనే అట్టేపెడితే బాగుంటుంది? మద్రాసు తీసుకువెడతానని చిన్నతనపు పట్టుపట్టకుసుమా" అని వెనుకనున్నవాడనియెను. "వొరేయి! సుబ్బారావూ, పద్యాలు పూర్తి అయినవా లేదా యింకా? తొరగా కానియ్యి. రాత్రి చదవాలి వీడు పీటలమీద కూచునప్పుడు. చిన్నతనంలో వీడికి యిలాంటి అదృష్టం పట్టడం బాగా వర్ణించాలిసుమా" అని యింకొక డనియెను.

అందరు నన్నివిధముల ననిరి. కొందరింకను తీవ్రముగ అనిరి. ఇట్లొక పావుగంట వేళాకోళములైన తరువాత అందరును తప్పుకొనిరి. స్నేహితునితో భాస్కరరావు ముందునకు పోయెను. "వూళ్ళోకి వెళ్ళడం గాదు. రండి రేవులో కూచుందాం. వాడితో కలిసే వెళ్ళవచ్చు వూళ్ళోకి" అని వారందరును వెనుదిరిగి కాలవగట్టెక్కిరి.

భాస్కరరావు మిత్రునితో గూడ కాల్వదాటి అతని నొకదెసకు పంపి తాను ఫ్యాక్టరీ చాటునకు పోయెను. కొంతసేపటికి మిత్రుడు వచ్చి కాళ్ళు కడుగుకొనియెను; గాని భాస్కరరావు రాలేదు. నిముసములు, గంటలు గడచినను ఆతని జాడ కనబడలేదు. మిత్రుడు ఊరిలోనికి బోయి సంగతి చెప్పగా అందరును వచ్చి వెదకిరి.

అంతయు అల్లకల్లోల మయ్యెను. ఊరందరును రామచంద్రుని వీధిలో మూగిరి. ఎవరికి తోచినట్లు వారూహించిరి. ఎవరినోటికి వచ్చినట్లు వారు మాట్లాడిరి. లచ్చుమ్మయు, జగ్గమ్మయు చెలరేగి తోచినవారి నందరిని తిట్టసాగిరి. రాత్రియంతయు ఇరువదిలాంతరులపని జరిగెను; గాని ప్రయోజనము కనబడలేదు. భాస్కరరావు జాడ తెచ్చినవారొక్కను లేరు.

వారముదినములు గడిచిన తరువాత మద్రాసునుండి జాబు వచ్చినది. "నాకోసం బెంగ పెట్టుకోవద్దు. జరిగినదానికి విచారించకండి. ఇక నాలుగైదేళ్ళ

దాకా నేనింటికి రాను" అని అందుండెను. "వెర్రిమొగం ఎవళ్ళో వేళాకోళం చేస్తే పారిపోతాడా? వెళ్ళి తీసుకురండి మన యింటోనే చేద్దాం కార్యం" అని లచ్చమ్మ అనేక విధముల పోరెను. గాని వీరయ్య అంగీకరింపలేదు. "మంచో చెడ్డో జరిగిపోయింది. తొందరపడకు, నాలుగేళ్ళు ఊరుకుంటే వయస్సూ, బుద్ధీగూడా పెరుగుతాయి" అనియెను. ◆